క్లుప్తంగా

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నారాయణరెడ్డి

కోవెలకుంట్ల: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి చక్కగా చదువుకుని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సీఐ నారాయణరెడ్డి సూచించారు. గురువారం స్థానిక వాసవీబొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈవ్‌టీజింగ్, ట్రాఫిక్ రూల్స్ తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కేశవరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్ చట్టరీత్యా నేరమన్నారు. సీనియర్లు జూనియర్ విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వెంకటరెడ్డి, మౌలానీ, వైస్ ప్రిన్సిపాల్ బాబునాథ్, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజు, భాస్కర్‌నాయక్, అన్నపూర్ణ, నాగేశ్వరరెడ్డి, రాజశేఖర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు అంబాపురంలో మంత్రి బుగ్గన పర్యటన

బేతంచెర్ల: మండల పరిధిలోని అంబాపురం గ్రామంలో శుక్రవారం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పర్యటన ఉంటుందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి గురువారం తెలిపారు. వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయ క్రాస్ రోడ్డు నుంచి గ్రామంలోకి నూతంగా వేసిన రహదారిని మంత్రి బుగ్గన ప్రారంభించి పాదయాత్ర చేస్తారన్నారు. అనంతరం గ్రామంలో భూ పంపిణీ కార్యక్రమంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు భూ పట్టాలు పంపిణీ చేస్తారని వివరించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, గ్రామ ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

94 శాతం పింఛన్ల పంపిణీ

కొలిమిగుండ్ల: వైఎస్సార్ పెన్షన్ కానుకలో భాగంగా రెండో రోజు గురువారం 94.31 శాతం పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీఓ సుబ్బరాజు చెప్పారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో 7009 పింఛన్లు ఉండగా 6610 మంది లబ్ధిదారులకు నగదు అందజేశారన్నారు.

సాయి గుడి నిర్మాణానికి రూ. లక్ష విరాళం


నగదు అందజేస్తున్న దాతలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలో నిర్మిస్తున్న శ్రీషిర్డీ సాయిబాబా గుడి నిర్మాణానికి దాతలు రూ. లక్ష అందజేశారు. పట్టణానికి చెందిన శృంగారపు బోసు కూతరు దివ్య, అల్లుడు సుమంత్, వీరి సంతానం అనన్యకుమారి, ఆయతి ఆస్ట్రేలియా నుంచి రూ. లక్ష విరాళంగా పంపారు. ఈ మొత్తాన్ని గురువారం ఆలయ కమిటీ సభ్యులు భాష్యం రమణగౌడ్, సురేష్, శ్రీరాములు, కృష్ణయ్య, బలరాంకు శృంగారపు బోసు అందజేశారు. కూతరు దివ్య స్నేహితురాలు ప్రియాంక పంపిన రూ. 10వేలు కమిటీ సభ్యులకు ఆయన ఇచ్చారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రామసుబ్బయ్య

కొలిమిగుండ్ల: బీజేపీ మండల అధ్యక్షుడిగా కొలిమిగుండ్లకు చెందిన కుమ్మరి రామసుబ్బయ్య ఎన్నికయ్యారు. గురువారం నంద్యాలలో జరిగిన కార్యవర్గ సమావేశంలో నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుడ్డా శ్రీకాంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు.

ఘనంగా ఏపీయూస్ ఆవిర్భావ దినోత్సవం

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఏపీయూఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాధికారి తిమ్మారెడ్డి పతావిష్కరణ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 1982 సంవత్సరం ఫిబ్రవరి 2వ తేదీన సంఘం ఏర్పడినప్పటి నుంచి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీపతి, శివప్రసాద్, కృష్ణవేణి, నీరజ, సుగుణ, ఉపాధ్యాయులు జ్యోతి, రమణమ్మ, శివశంకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఉసేనయ్య, వెంకటేశ్వరరెడ్డి, బాబు, సురేష్ పాల్గొన్నారు.

కడపకు వెళ్లి పింఛన్ అందజేత

కోవెలకుంట్ల: సంజామల మండలం రెడ్డిపల్లె చెందిన ఓ దివ్యాంగురాలికి గురువారం గ్రామ వలంటీర్ సఫియా కడపకు వెళ్లి పింఛన్ అందజేసింది. గ్రామానికి చెందిన విద్యార్థిని ఖుర్షిద్ కడప కేఎల్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం బీటెక్ చదువుతోంది. సెమిస్టర్ పరీక్షలు జరుగుతుండటంతో పింఛన్ తీసుకునేందుకు రాలేకపోయింది. దీంతో వలంటీర్ కళాశాలకు వెళ్లి పింఛన్ అందజేసింది.

పెరటికోడి...లాభాల కూత!

- మహిళలకు అదనపు ఆదాయం చేకూర్చుతున్న ప్రభుత్వం
- జిల్లాలో 2900 యూనిట్ల పంపిణీకి ప్రణాళికలు రూపొందిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు



బనగానపల్లె: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుంది. ఆసరా, చేయూత, చేదోడు తదితర పథకాలు అమలు చేస్తూ మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న ప్రభుత్వం... అదనంగా ఆదాయం చేకూర్చేందుకు పెరటికోళ్ల పంపిణీ చేపట్టిన విషయం తెలిసిందే. గతేడాది జిల్లాలో 1500 యూనిట్లు పంపిణీ చేసిన డీఆర్‌డీఏ అధికారులు సత్ఫలితాలను గుర్తించి మరింత ప్రోత్సహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ ఏడాది మండలానికి 100 యూనిట్లు చొప్పున జిల్లాలోని 29 మండలాలకు 2,900 యూనిట్లు పంపిణీకి కసరత్తు ప్రారంభించారు అధికారులు. యూనిట్ విలువ రూ.3150 ఉంటుంది. ఎనిమిది పెట్టలు, మూడు పుంజులు, ఓ మెడికల్ కిట్టు, బాక్స్‌ను యూనిట్ కింద పంపిణీ చేస్తారు. మార్చి చివరికి యూనిట్లు పంపిణీ చేసేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు. లబ్ధిదారుల చేతికి అందించిన 45 రోజులలోపు కోడుగుడ్ల ఉత్పత్తి మొదలవుతుంది. రోజుకు ఎనిమిది చొప్పున నెలకు 240 గుడ్లు ఉత్పత్తి అవుతాయని, ఏడాదికి 200 రోజులు తగ్గకుండా కోడిగుడ్ల ఉత్పత్తి ఉంటుందని అధికారుల అంచనా.

సత్ఫలితాలిస్తున్న పెరటికోళ్ల పెంపకం

పెరటికోళ్ల పెంపకం క్షేత్రస్థాయి పరిశీలనలో మంచి ఫలితాలను ఇస్తునట్లు డీఆర్‌డీఏ అధికారులు గుర్తించారు. కోళ్ల పెంపకానికి ప్రత్యేక సమయం లేనందున మహిళలు సైతం ఉత్సాహం చూపుతున్నారు. పరిసరాల్లో తిరుగుతూ అదనపు ఆదాయం చేకూరుతున్న నేపథ్యంలో మహిళలు వీటి పెంపకానికి ముందుకొస్తున్నారు కూడా. ప్రత్యేకించి కోడిగుడ్లకు, మాంసానికి మంచి ధర పలుకుతుంది. అదేవిధంగా వెలుగు సిబ్బంది మహిళలతో సమావేశాలు నిర్వహించి పెరటికోళ్ల పెంపకం లాభాలను వివరించి చైతన్య పరుస్తున్నారు.

సాధారణ కోళ్లతో కలిసి పెరుగుతున్నాయి



గతేడాది అధికారులు పెరటికోళ్లను పంపిణీ చేశారు. ఈ కోళ్లు సాధారణ కోళ్లతో కలిసి తిరుగుతున్నాయి. కోళ్ల ద్వారా లభించే గుడ్లు, మాంసం ధర గిట్టుబాటుగా ఉంటుంది. వీటి పోషణకు ఏ మాత్రం ఇబ్బంది లేదు. అదనపు ఆదాయం లభిస్తుంది.

– శ్రీదేవమ్మ, అమ్రేడ్డి నగర్, దొర్నిపాడు మండలం

పెరటికోళ్ల పెంపకం ఉపయోగకరం



పెరటికోళ్ల పెంపకం ఉపయోగకరంగా ఉంది. వీటిని ప్రత్యేకంగా పోషించాల్సిన అవసరం లేదు. ఇంటి పరిసరాల్లో తిరుగుతూ జీవిస్తాయి. ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నాటుగుడ్లకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

– ఆశాబీ, చాకరాజువేముల, దొర్నిపాడు మండలం

ఆర్థికంగా బలోపేతం



ఆసక్తిగా ఉన్న మహిళలను గుర్తించి పెరటికోళ్లు అందజేస్తూ ఆర్థికంగా బలోపేతానికి కృషి చేస్తున్నాం. వీటిని సక్రమంగా కాపాడుకుంటే యూనిట్‌కు రూ. 10 వేలు చొప్పున ఆదాయం లభిస్తుంది. మార్చి చివరి నాటికి ఎంపిక పూర్తి చేసి పెరటికోళ్లను లబ్ధిదారులకు అందజేస్తాం.

– వైటీ.శ్రీధర్‌రెడ్డి, పీడీ డీఆర్‌డీఏ నంద్యాల జిల్లా

6 నుంచి కనకాద్రిపల్లెలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కనకాద్రిపల్లె గ్రామ సచివాలయం పరిధిలో ఈనెల 6వ తేదీన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బరాజు గురువారం తెలిపారు. 6,7తేదిల్లో కనకాద్రిపల్లెలో మధ్యాహ్నం నుంచి కార్యక్రమం ఉంటుందని, 8న ఇటిక్యాలలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరవుతారని తెలిపారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తప్పక పాల్గొనాలని సూచించారు.

స్వయం ఉపాధికి శిక్షణ

బనగానపల్లె: లావణ్య మహిళా మండలి ఆధ్వర్యంలో స్వయం ఉపాధిపై మహిళలకు శిక్షణా కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు మహిళా మండలి అధ్యక్షురాలు రోజారమణి తెలిపారు.ఫిబ్రవరి 15వ నుంచి ఏప్రిల్ 15 వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. హ్యాండ్‌బ్యాగ్ యంబ్రాయిడరింగ్, బ్యూటిషియన్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని, 18 ఏళ్ల నుంచి 45 ఏళ్లవయస్సులోపు మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

4న హసన్ వలిస్వాముల ఉరుసు

డోన్ రూరల్ : మండల పరిధిలోని జగదుర్తి గ్రామం వద్ద వెలసిన శ్రీ హసన్‌వలిస్వాములవారి ఉరుసు మహోత్సవం 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 4వ తేదీ రాత్రి గంధం, 5న ఉరుసు, 6వ తేదీన జియారత్ ఉంటుందన్నారు.

బ్రిడ్జితోపాటు బ్యారేజీ నిర్మాణానికి మద్దతు


సమావేశంలో మాట్లాడుతున్న కామని వేణుగోపాల్‌రెడ్డి

కోవెలకుంట్ల: కృష్ణానదిపై నిర్మించ తలపెట్టిన తీగల వంతెన స్థానంలో బ్రిడ్జితోపాటు బ్యారేజీ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మద్దతు ప్రకటించినట్లు రాయలసీమ జాయింట్ యాక్షన్ కమిటీ కో ఆర్డినేటర్ కామని వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం కోవెలకుంట్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 167వ జాతీయ రహదారిపై కేంద్ర ప్రభుత్వం తీగల వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు తాగు, సాగునీరు పుష్కలంగా అందాలంటే తీగల వంతెన స్థానంలో బ్రిడ్జితోపాటు బ్యారేజీని నిర్మించడం శ్రేయస్కరమన్నారు. సాగునీటి ఉద్యమ కారులతో ఏకభవించి బ్రిడ్జికం బ్యారేజీ ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర రహదారులు, భవనాలశాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్రసింగ్ శేఖావత్, జలవనరులశాఖ సలహాదారు శ్రీరామ్‌కు సోము వీర్రాజు ఉత్తరాలు రాయడం అభినందించదగ్గ విషయమన్నారు. దీనిని సాధించుకునేందుకు రాయలసీమ వాసులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి


ఏఓ సమక్షంలో రైతులతో ఈకేవైసీ చేయిస్తున్న వ్యవసాయ సిబ్బంది

అవుకు: ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి అమలు చేస్తున్న పెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు సూచించారు. మండల పరిధిలోని కునుకుంట్ల, ఉప్పలపాడు, కొండమనాయునిపల్లె గ్రామాల్లోని ఆర్బీకేలను గురువారం ఏఓ సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి ఈకేవైసీ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లో సాగు చేసిన పంటలను పరిశీలించిన ఏఓ రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరైతు తాను సాగు చేసిన పంటలను నమోదు చేసుకోవాలని, ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ క్రాప్ నమోదు చేసుకుంటే ప్రకృతి వైపరిత్యాల వలన పంటలు నష్టపోతే ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏలు శారద, భానుప్రకాశ్, జయకృష్ణ, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులు పరిశీలించిన ఎంపీపీ

బేతంచెర్ల: వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి పరిశీలించారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో సుమారు రూ. 3.90 కోట్లతో జరుగుతున్న స్వామివారి ఆలయ పునర్నిర్మాణ పనులు, ఆలయ ఆవరణనుంచి స్వామివారి చెంత వరకు సుమారు రూ. 1.98 కోట్లతో వేస్తున్న రహదారి, కల్వర్టు పనులను పరిశీలించారు. అంతకుముందు స్వామి, అమ్మవార్లను ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డిని ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ సీతారామ చంద్రుడు స్వామి వారి పట్టు వస్త్రంతో సత్కరించగా వేదపండితులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు తిరుమలేశ్వర్ రెడ్డి, ఎద్దులన్న, మధు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యపై విచారణ


మృతుని భార్య, కుటుంబ సభ్యులను విచారిస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: మండలంలోని సౌదరదిన్నె గ్రామానికి చెందిన చిన్న బాదుల్లా అనే రైతు ఆత్మహత్యపై గురువారం అధికారులు విచారణ చేపట్టారు. వ్యవసాయంలో నష్టాలు రావడంతో అప్పులబాధ తాళలేక గత నెల 23వ తేదీన బాదుల్లా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మండలస్థాయి త్రీమెన్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామాన్ని చేరుకుని ఆత్మహత్య సంఘటనపై విచారణ జరిపారు. తహసీల్దార్ పుష్పకుమారి, మండల వ్యవసాయాధికారి నిరంజన్, ఎస్‌ఐ వెంకటరెడ్డి మృతుని భార్య రహినాబీ, కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు. సాగు చేసిన పంటల వివరాలు, బ్యాంకులు, ప్రైవేట్ వ్యక్తుల వద్ద చేసిన అప్పులు తదితరాలపై ఆరా తీశారు. మృతి చెందిన రైతుకు సంబంధించిన వివరాల నివేదికను జిల్లా అధికారులకు పంపనున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

- డీఎంహెచ్‌ఓ వెంకటరమణ


జలదుర్గం పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

ప్యాపిలి: పీహెచ్‌సీలతో పాటు విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని డీఎంహెచ్‌ఓ వెంకటరమణ అన్నారు. మండల పరిధిలోని జలదుర్గం, ప్యాపిలి పీహెచ్‌సీలతో పాటు ఆయా గ్రామాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లను డీఎంహెచ్‌ఓ వెంకటరమణ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలలో ఆపరేషన్ థియేటర్, వార్డులను పరిశీలించారు. ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న మందులను రికార్డుల పరంగా తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్య సేవల విషయంలో ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలని వైద్యాధికారులు ఇంతియాజ్ ఖాన్, వాణిశ్రీ, నితీశ్ కుమార్‌కు సూచించారు. అనంతనం ఆయన జలదుర్గం ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

డోన్ రూరల్ : గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని నంద్యాల జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ వైద్య సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని కొచ్చెర్వు గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజిషన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ప్రజలకు అందిస్తున్న సేవల గురించి ప్రజలను అడిగితెలుసుకున్నారు. అలాగే జాతీయ ఆరోగ్య సేవల గురించి ఆరా తీశారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడుతూ గర్భిణులకు ప్రత్యేకంగా హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించాలని సూచించారు. అదేవిధంగా ఎన్‌సీడీసీడీ సర్వేను వంద శాతం పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో చిన్నమల్కాపురం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ విజయ్‌భాస్కర్, పీహెచ్‌ఎన్ సరోజమ్మ, సూపర్‌వైజర్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

డోన్ రూరల్: మండల పరిధిలోని దొరపల్లి గ్రామం సమీపాన మట్కా రాస్తున్న ఉడుములపాడుకు చెందిన మిద్దెపల్లి ప్రసాద్, డోన్ పట్టణంలోని చిగురుమాన్‌పేటకు చెందిన వడ్డె రామచంద్రుడిని అరెస్టు చేశామని ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. చీటీలు, రూ. 20వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

కోవెలకుంట్ల: సంజామల మండలం రెడ్డిపల్లె గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ ప్రతాప్ అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన శ్రీనివాసులు, కార్తీక్ బైక్‌పై సొంత పనుల నిమిత్తం పేరుసోములకు వెళ్లి తిరిగి బయలుదేరారు. కొలిమిగుండ్ల మండలం బెలూం గ్రామానికి చెందిన శివ అనే వ్యక్తి రెడ్డిపల్లె నుంచి వెళ్తుండగా రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల ఆసుపత్రికి తరలించారు. వీరిలో శ్రీనివాసులు, శివ పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కోవెలకుంట్ల: సంజామల మండలం పేరుసోముల గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ ప్రతాప్ అందించిన సమాచారం మేరకు.. అనంతపురం జిల్లా యలనూరు గ్రామానికి చెందిన సుబ్బరాయుడు, నాగార్జున అనే వ్యక్తులు రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. వారి నుంచి 45 ప్యాకెట్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

శివస్వాములకు భిక్ష


భిక్ష వడ్డిస్తున్న మత సామరస్య వేదిక సభ్యులు

బేతంచెర్ల: మతసామరస్య చైతన్య వేదిక ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు పట్టణంలో శివమాల స్వీకరించిన స్వాములకు గురువారం భిక్ష కార్యక్రమం నిర్వహించారు. మతసామరస్య చైతన్య వేదిక గౌరవ అధ్యక్షులు ముస్తాక్ అహ్మద్ అభిలాష్, అధ్యక్ష, కార్యదర్శులు నూర్ అహ్మద్, గౌస్ తదితరులు స్వయంగా శివస్వాములకు భిక్ష వడ్డించారు. ఏటా రంజాన్ మాసంలో ముస్లింలకు హిందూ సోదరులు ఇఫ్తార్, శివ మాలధారులకు ముస్లింలు భిక్ష ఏర్పాటు చేస్తూ మతసామరస్యాన్ని చాటుతున్నారు. ఇలాంటి కార్యక్రమాలు హిందూ, ముస్లిం సోదరులు మధ్య అనేకం జరగాలని శివ గురుస్వాములు నారాయణ స్వామి, మహేశ్వర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో సభ్యులు జయంత్ గౌడ్, రషీద్, రవి, జాకీర్, నజీర్ , సుధాకర్ పాల్గొన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


స్వామి కల్యాణంలో పాల్గొన్న మహిళలు

బేతంచెర్ల: పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో శ్రీరామానుజ భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. మాగశుద్ధ ద్వాదశి గురువారం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువుంచి మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల, బంతుల ఆట ఆడుతూ స్వామివారి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు లక్ష్మి మల్లిక తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని పూదోట మఠంలో భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని బుధవారం ప్రారంభమైన అఖండ విష్ణు సహస్రనామ పారాయాణం గురువారం ముగిసింది. ఆశ్రమ నిర్వాహకులు, ఆయా కాలనీల మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్డీఓకు వినతి

డోన్ టౌన్: విజయ పాలడైయిరీ తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ గురువారం ఆర్డీఓ వెంకటరెడ్డికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివరాం, మండల అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, భాస్కర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 20 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. కార్మికులను విధుల్లోకి తీసుకోకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నాగమద్దయ్య, చిన్న రహిమాన్, లంక సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ పూజలు

డోన్ టౌన్: మండల పరిధిలోని ఉడుములపాడు సమీపాప జాతీయ రహదారి ప్రక్కన నూతనంగా నిర్మించిన దేవాలయంలో శుక్రవారం నుంచి శ్రీరేణుకా యల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యాక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. అర్చకులు కళ్ళె శేషావలి శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. మొదటి రోజు గనపతి పూజ, కలశ స్థాపన, దీక్షా హోమాలు, శనివారం ప్రాతఃకాల పూజలు, అభిషేకాలు, హోమాలు, అమ్మవారి విగ్రహానికి గ్రామోత్సవం ఉంటుందన్నారు. అదేవిధంగా ఆదివారం ఉదయం 7.45 నుంచి 8.45 గంటల లోపు యంత్ర ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు తరలివచ్చి అమ్మవారి ఆశీర్వాదాలు పొందాలన్నారు.

ఓపీఎస్ సాధన దీక్షను విజయవంతం చేయండి

ప్యాపిలి: ఎస్టీయూ పిలుపు మేరకు ఈ నెల 3వ తేదీన వైఎస్సార్ జిల్లాలో కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ఓపీఎస్ సాధన దీక్షను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌నాయక్, నంద్యాల జిల్లా సీపీఎస్ కన్వీనర్ చిన్నపరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 2 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు సీపీఎస్ విధానంలో కనీస భద్రత లేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు హాజీ మస్తాన్ వలి, సుభాష్, వెంకటేశ్వర్లు, దేవేందర్ రెడ్డి, మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం


సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: పేదరిక నిర్మూలనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు మూర్తుజావలీ, మండల కన్వీనర్ లక్ష్మిరెడ్డి, మండల నాయకులు బాబుల్ రెడ్డి, ఖాజా తెలిపారు. మండలంలోని గోర్లగుట్ట గ్రామంలో గురువారం ఎంపీపీ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ వెంగన్న, సర్పంచ్ భూషి మాదక్క, సచివాలయ పంచాయతీ కార్యదర్శి శ్రీలత, స్థానిక నాయకులతో కలిసి ఎంపీపీ గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేసిన అభివృద్ధిని ఆయన ప్రజలకు వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అదేవిధంగా ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ కాల్వలు, సీసీ రోడ్లు, కుళాయిలు, గృహాలు మంజూరు చేయించాలని గ్రామస్తులు ఎంపీపీని కోరారు. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్య తనిస్తున్నామని, సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేయించడంతోపాటు గోరుకల్లు రిజర్వాయర్ ద్వారా శుద్ధమైన నీరు సరఫరా చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ రంగస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, తిరుమలేశ్వర్ రెడ్డి, ఎద్దులన్న, చలపతి రెడ్డి, వెంకిరెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సుధాకరప్ప, భాస్కర్ పుల్లయ్య, రామనాయుడు, తిమ్మయ్య గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రజకుల సౌకర్యార్థం బోరు


బోరు వేస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: మండలంలోని వెంకటాపురం గ్రామంలో రజకులు దుస్తులు శుభ్రం చేసేందుకు అవసరమైన ప్రత్యేక బోరును ఏర్పాటు చేశారు. రజకుల సమస్యలు గుర్తించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదేశాల మేరకు బోరు వేయించినట్లు సర్పంచ్ టి.హరిత, గ్రామ వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు టి.శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యేకు రజకులు బోరు సమస్యను విన్నవించారని గుర్తు చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే స్పందించి ప్రత్యేక బోరు మంజూరు చేయించారన్నారు. సమస్యను పరిష్కారించడంతో రజకులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.